ప్రజాశక్తి
మంగళవారం 26 నవంబర్ 2024 5 అనంతపురం





బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డా॥గేయానంద్







డిఆర్‌సి ఎప్పుడో..?

◆ఐదు మాసాలైనా జిల్లా అభివృద్ధిపై సమీక్ష లేదు

◆కనీస ప్రస్తావన చేయని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాధారణంగా ప్రభుత్వం వచ్చిన కొత్తలో జిల్లాలోని సమస్యలపై సమీక్ష జరిపి.. భవిష్యత్ ప్రణాళికపై దృష్టి సారిస్తారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు మాసాలు పూర్తయ్యింది. ప్రభుత్వం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని నియమించింది. మంత్రి టిజి.భరత్ ఇన్‌ఛార్జీగా ఉన్నారు. ఆయన ఆదివారం నాడు జిల్లాకు విచ్చేశారు. అయితే ఆయన ఒక సామాజి తరగతికి చెందిన సమావేశంలో పాల్గొని వెళ్లిపోయారు. అయనతో కలసిన అధికారులతో ముచ్చటించారు. జిల్లా అభివృద్ధి కమిటీ(డిఆర్‌సి) నిర్వహించడంపై మాత్రం దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. సత్యసాయి జిల్లా వరకు చూస్తే అక్కడి ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇది వరకే విచ్చేసి డిఆర్‌సిని నిర్వహించారు. అంతకు మునుపు జిల్లా మంత్రులు సవితమ్మ, సత్యకుమార్‌లు జిల్లా పరిస్థితులపై ఒక సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లా వరకు చూస్తే ఇప్పటి వరకు జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్‌గానీ, ఇటు ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్‌గాని ఆ వైపుగా దృష్టి సారించలేదు.

ఎక్కడి సమస్యలక్కడే..

అనంతపురం జిల్లాలో అనేక సమస్యలు నెలకొన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలు ప్రకృతి వైపరీత్యాల మూలంగా రెండు రకాలుగా నష్టపోయారు. ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటిస్తే దానిపైనా విపక్షాలు తప్పుబడుతున్నాయి. అన్ని మండలాలను కరువు మండలలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే కీలకమైన ఆగస్టు నెలలో వర్షాలు పడకపోవడంతో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం పడిపోయింది. అదే విధంగా వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. వాటికి పరిహారం అందాల్సి ఉంది. ఇక సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు. అనేక ఇబ్బందులు సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలోనూ ఉన్నాయి. ఇవి కాకుండా తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. సత్యసాయి తాగునీటిపైపులైన్‌లు కూడా మార్చాల్సి ఉంది. ఈ విషయం స్వయంగా ఆర్థిక శాఖ మంత్రి తన సొంత నియోజకవర్గంలో పరిశీలనలోనే తేలింది. ఇది ఆ ఒక్క నియోజకవర్గానికే పరిమితమై లేదు. జిల్లా అంతటా అదే పరిస్థితి నెలకొని ఉంది. దీనిపై ప్రభుత్వం ఏ రకంగా చర్యలు తీసుకుంటుందన్నది ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలుగానున్నాయి. ఇక పారిశ్రామిక ప్రగతికి అనేక హామీలు గతంలో ఇచ్చియున్నారు. కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇది డీ.హీరేహాల్ మండలంలో ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమి చేస్తారన్నది ప్రశ్నార్థంగానే ఉంది. ఇలా అనేక సమస్యలు జిల్లాలో నెలకొని ఉన్నాయి. వీటిపై కొత్త ప్రభుత్వంలో చర్చించి రాబోయే రోజుల్లో ప్రజలకు పరిష్కార మార్గాలను ఏమి తీసుకోబోతున్నారన్నది తెలియాలంటే డిఆర్‌సి జరగాల్సి ఉంది. అయితే ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తారా మరింత కాలం వేచి చూడాల్సిందేనన్నది తెలియాల్సి ఉంది.

మహిళలపై హింసను నిర్మూలించాలి

◆మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

◆ఐద్వా ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో రోజురోజుకు మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచార సంఘటనలను నియంత్రించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. సోమవారం నాడు హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి నేతత్వంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట నిర్వహించిన బైక్ ర్యాలీని గేయానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ర్యాలీ టవర్ క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా శ్రీ కంఠం సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో హింసలేని సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా మహిళలపై హింసాయుత ఘటనలు చోటు చేసుకుంటూ ఉండడం విచారకరం అన్నారు. మహిళా రక్షణకు చట్టాలు ఉన్నప్పటికీ హింసలు జరుగుతుండడం ఆందోళన కలిగించే అంశం అన్నారు. మహిళల హక్కులను కాపాడకుండా హింసలేని సమాజాన్ని నిర్మించలేమన్నారు. మహిళలు అందరినీ గౌరవించే అలవాటును ప్రతి ఒక్కరూ విధిగా నేర్చుకోవాలన్నారు. మహిళలపై హింస పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షిస్తే మళ్లీ అలాంటి ఘటనలు పునరావృతం కావన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారాలు దాడులు పెరిగాయన్నారు. మాదకద్రవ్యాలు, మద్యం, పోర్న్ వల్ల యువత పేడదోవ పడుతోందన్నారు. ఇలాంటి వాటికి వ్యతిరేకంగా యువతలో సామాజిక చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు కళాశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో హింసా వ్యతిరేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కమిటీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ నాయకులు సుశీల, మహాలక్ష్మి, అనిత, తులసి, కుమారి, షబానా, మాబి, వరలక్ష్మి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాఉ జయప్రదం చేయాలని సిఐటియు 1వ నగర కమిటీ కార్యదర్శి వై.వెంకట్ నారాయణ పిలుపునిచ్చారు. సిఐటియు నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చాక రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అధికం అయ్యాయన్నారు. కార్మిక చట్టాలు సవరణను అమలు చేస్తూ లేబర్ కోడ్స్‌ను తెచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. రైతుల నల్ల చట్టాలను రద్దుచేసి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ధర్నాలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

డిసెంబర్ 1వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బొమ్మనహాల్ పర్యటన ఉండనుందన్న సమాచారంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌లు సోమవారం ఉదయం మండల పరిధిలోని ఉద్దేహల్, ఉప్పరహాల్, ఎల్బీనగర్, ఉంతకల్లు, గోవిందవాడ గ్రామాలను సందర్శించారు. చంద్రబాబు నాయుడు ప్రజలతో ముఖాముఖి గ్రామసభ నిర్వహించేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా ఉద్దేహాల్ జిల్లా పరిషత్ హై స్కూల్, ఉలిగమ్మ గుడి రచ్చకట్ట, ఉప్పరహాల్ నరసింహస్వామి గుడి, ఎల్‌బి.నగర్ రోడ్డు పక్కలో పొలం, ఉంతాకల్లు గుర్రప్ప కట్ట, గోవిందవాడ వాల్మీకి సర్కిల్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.రవిబాబు, ఆర్డీవో వసంత బాబు, సిఐ వెంకటరమణ, తహశీల్దార్ మునివేలు, ఎంపీడీవో దాస్ నాయక్, ఎస్ఐ నబీరసూల్ పాల్గొన్నారు.

అహుడా ఛైర్మన్‌గా వరుణ్ ప్రమాణస్వీకారం

కూటమినేతల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ(అహుడా) ఛైర్మన్‌గా జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ అంబేద్కర్ ఫ్లైఓవర్ నుంచి అహుడా కార్యాలయం వరకు అభిమానులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాల నడుమ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కాలవ శ్రీనివాసులు, బండారు శ్రావణి శ్రీ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా బిజెపి అధ్యక్షులు సంధిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జనసేన రాష్ట్ర కార్యక్రమాల ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, రాయలసీమ ప్రాంతీయ మహిళా కన్వీనర్ పెండ్యాల శ్రీలత తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిసి.వరుణ్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో తాను అహుడా ఛైర్మన్ బాధ్యతలు చేపట్టానని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో అనంతపురం- హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో అభివృద్ధి చేస్తూ ప్రజా సేవ చేయనున్నట్లు తెలిపారు. టిసి వరుణ్ అహుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తల సంబరాలు మిన్నంటాయి.



అహుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న టిసి.వరుణ్

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలిపారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, డిఆర్ఒ ఏ.మాలోల, ఆర్డీవో వసంత బాబు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శిరీష, డిపిఒ నాగరాజు నాయుడు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మతో కలిసి 662 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను గడువులోగా వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు జిల్లా కేంద్రానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు ఎక్కువ వస్తున్నాయని, సంబంధిత అధికారులు వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ కింద బాల్య వివాహాలకు వ్యతిరేక ప్రతిజ్ఞకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గోకులాల పరిశీలన

కళ్యాణదుర్గం రూరల్ : జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జిపి వెంకటస్వామి సోమవారం మండలం లోని మల్లికార్జునపల్లి గ్రామంలో గోకులాలను పరిశీలించారు. రైతులు ఎంత వేగంగా గోకులం షెడ్లు పూర్తి చేస్తే బిల్లులు కూడా త్వరితగతిన మంజూరవుతాయని తెలిపారు. గోకులం షెడ్ల వల్ల పశువులు, గొర్రెలు, కోళ్లకు మెరుగైన వసతి సౌకర్యం ఏర్పడుతుంద న్నారు. చలి, ఎండ, వాన నుంచి పశువులకు రక్షణ కల్పించడం వల్ల వ్యాధులు దరి చేరవన్నారు. ఆయన వెంట కళ్యాణదుర్గం సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసగుప్తా, పశువైద్యులు డాక్టర్ పి.మంజునాథ్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నవీన్, హుళికల్లు ఎహెచ్ఎ రంగమ్మ, రైతులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ డా॥ఎంవి.శేషయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సెన్స్ విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలు, సోషల్ మీడియా వల్ల ఎదురయ్యే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి.శేషయ్య మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగే తీరును, మోసపోయే అవకాశాలను వివరించారు. జంతుశాస్త్ర అధ్యాపకులు బి.ప్రభావతిదేవి మాట్లాడుతూ సోషల్ మీడియా పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, తదితర సోషల్ మీడియాలో అమ్మాయిలు ఫొటోలను అప్‌లోడ్ చేసే విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. తెలియని ఎలాంటి లింకులను ఓపెన్ చేయ వద్దన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థి వారి కుటుంబ సభ్యులు, సమాజంలోని వ్యక్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చాముండేశ్వరి దేవి, సుధాకర్, రవిశంకర్, మౌనికసాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నిద్దాం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

ప్రజాశక్తి-తాడిపత్రి

కేంద్ర, రాష్ట్రం అనుసరించే ప్రజా వ్యతిరేక విధనాలను ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు పిలుపునిచ్చారు. తాడిపత్రి సిఐటియు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, బడుగు బలహీన వర్గాల వారిపై దాడులు పెరిగాయన్నారు. వీటిని నియంత్రించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మాటల్లోనే ఉచిత ఇసుక విధానం ఉందన్నారు. ఇప్పటికీ ఇసుక కావాలంటే అధిక మోతాదులో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అందరికీ ఇసుక అందుబాటులో తేకపోతే భవన నిర్మాణరంగం పూర్తిగా కుదేలు అవుతుందన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని వాటిని నియంత్రించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంజి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాల్లో అవినీతిని అరికట్టండి : సిపిఎం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఆర్‌డిటి ఎకాలజీ సెంటర్‌లో సోమవారం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్ సెల్(ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చా రు. ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చా లని, చెరువులు, కుంటల మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టాలని, భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువకు భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పట్టణంలోని ప్రభుత్వా సుత్రి, పలు సచివాలయాల్లో అవినీతిని అరికట్టాలని కోరారు. ట్రాఫిక్ సమస్య తీవ్రమైందని నివారణ చర్యలు చేపట్టాలని విన్నవించారు. వసతి గృహాల్లో బకాయి మెస్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించాలని, మెస్ ఛార్జీలు పెంచి ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేయాలన్నారు. ప్రతి మండలంలో జనన ధ్రువీకరణ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. సచివాలయాలు, ఆసుపత్రిలో డబ్బులు అడిగితే అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ముద్దినాయనపల్లిలో గిరిజన గురుకుల బాలుర పాఠశాల భవన నిర్మాణ పనులను, కళ్యాణదుర్గంలో అంబేద్కర్ భవనానికి సంబంధించి టెండర్లు పిలిచి పనులను ప్రారంభిం చాలని కళ్యాణదుర్గం సబ్ డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మారంపల్లి కాలనీలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల వసతి గృహంలో డార్మెటరీ బ్లాక్, ప్రిన్సిపల్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ క్వార్టర్స్, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, ప్రహరీ, విద్యుత్, మినరల్ తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు.

బ్రహ్మసముద్రం : కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లి వరకూ తారు రోడ్డు వేయాలని కోరుతూ ఎపిజిఎస్‌కెఎస్ నాగరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవించారు. ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లి వరకూ రహదారి కంకర తేలి ఉందన్నారు. దీంతో ఈ మార్గంలో ఇప్పటికే పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. గ్రామాలకు కనీసం అంబులెన్స్ రాలేని దుస్థితి నెలకొందన్నారు. 13 గ్రామాల ప్రజలు రాయదుర్గం, కళ్యాణదుర్గం వెళ్లాలంటే నరకప్రాయంగా ఉందన్నారు. తక్షణమే తారు రోడ్డు వేయాలని కోరారు.



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్యలు వివరిస్తున్న సిపిఎం నాయకులు

కలెక్టర్‌కు సన్మానం

మంత్రి నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. కళ్యాణదుర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకురాలు సింగమనేని అరుణ, ధనుంజయ, గోవిందరాజులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

పంచాయతీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సోమవారం సర్పంచి వనితా మల్లికా ర్జున పిఆర్ ఇంజినీర్ విజయ్‌కృష్ణతో కలిసి పర్యవేక్షించారు. కోనాపురం గ్రామంలో రోడ్ల పనులను పరిశీలించి నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలన్నారు. సూగేపల్లి చెన్నమల్లేశ్వర జాతరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వారితో పాటు పంచాయతీ కార్యదర్శి అనిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లలిత, అగ్రికల్చర్ అసిస్టెంట్ ముజాహిద్, మాజీ ఎంపీటీసీ కరేగౌడ, అక్కన్న, దండు తిప్పేస్వామి, గోపి ఉన్నారు.

విద్యార్థికి చేయూత

రాయదుర్గం : గత నెలలో మృతి చెందిన ట్యాక్సీ డ్రైవర్ అబ్దుల్లా తరఫున రాయదుర్గం ట్యాక్సీ యూనియన్ ప్రతినిధులు సోమవారం పట్టణంలోని బళ్లారి రోడ్డు వద్ద ఉన్న జామియా అన్వరుల్ ఉలూమ్ మదరసా విద్యార్థికి చేయూతనందించారు. ట్యాక్సీ నిర్వాహకులు కిరణ్‌కుమార్ మదరసాలోని ఒక విద్యార్థి ఏడాది నిర్వహణ వ్యయం రూ. 10,200లను మదరసా ప్రిన్సిపల్ ముఫ్తి నూర్ మొహమ్మద్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు రామంజి, తిప్పేస్వామి, ప్రగతి, బాషా తదితరులు పాల్గొన్నారు. మదరసా కమిటీ సభ్యులు జక్రియా మాట్లాడుతూ స్నేహితుడి జ్ఞాపకార్థం ఓ విద్యార్థి విద్యకు సాయం అందించడం అభినందనీయం అన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ సిఐగా యువరాజ్

ప్రజాశక్తి- కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం పట్టణ సిఐగా సోమవారం యువరాజ్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో శెట్టూరు, కళ్యాణదుర్గం పట్టణ ఎస్ఐగా పనిచేశారు. అనంతరం ఆయన పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌ను కలిసిన నరసింహులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రాష్ట్ర నాయీబ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సోమవారం విజయ వాడలోని బిసి కార్పొరేషన్ భవన్‌లో రుద్రకోటి సదాశివమ్ ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు గుండిగానిపల్లి నరసింహులు సదాశివంను కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మండల నాయీబ్రాహ్మణుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కోఆర్డినేటర్ నూతిమడుగు ఎంసి.తిమ్మప్ప, నాయీబ్రాహ్మణ బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కొండన్న, ఆదినారాయణ ఉన్నారు.



సదాశివమ్‌కు పుష్పగుచ్ఛం అిఇస్తున్న నరసింహులు

సాగుదారులకు న్యాయం చేయండి : సిపిఎం

అనంతపురం కలెక్టరేట్ : కూడేరు మండలంలోని సర్వే నెంబర్ 535లో సాగు చేస్తున్న పేదలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరారం చెల్లించి భూమికి బదులు భూమి ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నాడు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ కూడేరు అరవకూరు కడదరకుంట గ్రామాల పేదలు గత 40 సంవత్సరాల నుంచి కొండలు, గుట్టలు చదురు చేసుకుని సాగు చేసుకుంటున్నారన్నారు. వీటికి పట్టాలు ఇవ్వాలని అధికారులను ఎన్ని సార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సాగు రైతులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.కరీం సాబ్, సహాయ కార్యదర్శి కె.వెంకటేశులు, నాయకులు చిదంబరమ్మ, అలివేలమ్మ , శ్రీనివాసులు, రామాంజనేయులు, గంగాధర, చౌడన్న, పరమేష్ , దుర్గాదేవి, సాగుదారులు పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష తగదు

అంతర్జాతీయ స్త్రీహింస నిర్మూలన దినోత్సవంలో వక్తలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఎస్ఐ హనీముల్లా

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

బాలికలపై తల్లిదండ్రులు వివక్ష చూపకుండా బాల, బాలికలను సమానంగా చూడాలని ఎంపిడిఒ శకుంతల, ఎఎస్ఐ హనీముల్లా, ఆర్‌డిటి ఎటిఎల్ లలిత సూచించారు. స్త్రీహింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌డిటి ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని అశ్వర్థనారాయణస్వామి ఆవరణలో ఉన్న సాంస్కృతిక కమ్యూనిటీ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, పురుషులు అనే భేదం చూపకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిసి సభ్యులు ఆదిలక్ష్మి, సుబ్బరాయుడు, ఈరన్న, మండల సిఐలు ఓబులేసు, ఆంజనేయులు, నాగప్ప, వికలాంగుల జీవో నాగరత్న, సిబిటి చంద్రశేఖర, చాగలు వెంకటనారాయణ, కొత్తపల్లి పి.లక్ష్మినారాయణ, నర్సాపురం మురళి, నాగలక్ష్మి, పసులూరు రామాంజనేయులు, రామ్మోహన్, ముచ్చుకోట మల్లికార్జున, తబ్జుల రామాంజనేయులు, శోభ, లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు మెలకువలు పాటించాలి

ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణంలో తగు మెళకువలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. రెండు రోజుల క్రితం గార్లదిన్నె ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. ప్రమాదాల్లో మరణిస్తే కుటుంబాలు నష్టపోవడమే కాకుండా మన ఉద్యోగులు, సంస్థ కూడా నష్టం జరుగుతుందన్నారు. సంస్థపై కూడా ప్రజల్లో ఆదరణ కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ మూడు నెలలు చలికాలం ఉన్నందున తెల్లవారుజామున చలి, పొగ మంచు ఎక్కువగా కురిసి రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. కావున డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకుని ఏకాగ్రతతో విధులు నిర్వహించాలని కోరారు.

నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


ఆదినారాయణను సన్మానిస్తున్న తెలుగు యువత నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ఏపి నాయిబ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణను సోమవారం మండల తెలుగు యువత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు కాయల సురేష్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆదినారాయణ చురుగ్గా పాల్గొనేవారన్నారు. ముఖ్యంగా 'బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ రాష్ట్రానికి, సభ్యత్వ నమోదు, యువగళం పాదయాత్ర వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పని చేశారన్నారు. ఆయన సేవలను అధిష్టానం గుర్తించి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిట్టా పవన్, డీలర్లు కె.సత్యనారాయణ, మసూద్‌వలి, పోతలయ్య, బాబావలి, బాషా, కాయల నారాయణస్వామి, బోయ నరేష్, కాయల శివశంకర్, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు : కమిషనర్


చెత్తను ఎత్తివేయిస్తున్న కమిషనర్ జబ్బార్‌మియా

ప్రజాశక్తి-గుత్తి

రహదారులపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా హెచ్చరించారు. సోమవారం మున్సిపాలిటీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్, ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని గాంధీ కూడలి నుంచి బస్టాండ్ వరకూ దుకాణాలను పరిశీలించి దుకాణాల ఎదురుగా రోడ్లపై వేసిన చెత్తను దుకాణదారులతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వినియోగిస్తే ప్రజలు అనారోగ్యానికి గురి అవుతారని చెప్పారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను విక్రయించే దుకాణదారులపై భారీ జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, శానిటరీ కార్యదర్శులు పి.సురేష్ బాబు, దుర్గాప్రసాద్, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని కొత్తపేట గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం పనులను కేంద్ర బృందం సోమవారం పరిశీలించింది. ఇందులో భాగంగా కేంద్ర బృందం సభ్యులు ఎస్‌కె.కులశేస్త్ర, జాళీ కేశవన్ కలిసి గ్రామంలోని పలుప్రాంతాల్లో జల జీవన్ పథకం పనులను తనిఖీ చేశారు. అలాగే స్వచ్ఛభారత్‌కు సంబంధించి చెత్త సేకరణ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి.ప్రభాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వసీమా సయ్యద్, ఎఇఇ రామలింగేశ్వరరెడ్డి, సర్పంచి ఆర్.గురుమస్తాన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.


జల్‌జీవన్‌పై ఆరాతీస్తున్న కేంద్ర బృందం సభ్యులు


గుమ్మనూరు ఈశ్వర్‌తో టిడిపి నాయకులు

గుమ్మనూరు ఈశ్వర్‌ను కలిసిన టిడిపి నాయకులు

పామిడి : మండలంలోని అనుంపల్లి గ్రామ టిడిపి నాయకులు సోమవారం గుంతకల్లులోని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ స్వగృహంలో ఆయన తనయుడు, పామిడి ఇన్‌ఛార్జి ఈశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా గ్రామంలోని సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో అనుంపల్లి టిడిపి నాయకులు, వైస్ ఎంపిపి కాయల మహేష్, సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌యాదవ్, ఆవుల శివ పాల్గొన్నారు.

వాడీవేడిగా గుంతకల్లు మున్సిపల్ సమావేశం


కౌన్సిలర్ల వాదోపవాదాలు

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవానీ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. ముందుగా టిడిపికి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ రవి వార్డులో కల్వర్టు కుంగిపోయి ఉన్న ఫొటోను వైసిపికి చెందిన కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్‌బాషా కమిషనర్ నయీమ్‌అహ్మద్‌కు చూపాడు. దీంతో వైసిపి కౌన్సిలర్లు రవి, సుధాకర్ ఇది సరైంది కాదని, వార్డులో సమస్యలు కౌన్సిలర్ చూసుకుంటాడని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం ప్రారంభమైంది. వెంటనే వైస్ ఛైర్‌పర్సన్ మైమున్ కలుగజేసుకుని ప్రజా సమస్యలు కోఆప్షన్ సభ్యుడు అధికారుల దృష్టికి తీసుకొస్తే తప్పేంటని ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఇందుకు ఛైర్‌పర్సన్ స్పందిస్తూ ఇద్దరూ సభా గౌరవాన్ని పాటించాలని కౌన్సిలర్లకు సూచించడంతో రగడ సద్దుమణిగింది. అంతకు ముందుగా సమావేశం ప్రారంభంలో మున్సిపల్ రిజర్వుడు స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటికి కంచెలు వేసి సంరక్షణ చేయాలని కౌన్సిలర్ పవన్‌కుమార్‌గౌడ్ ఛైర్‌పర్సన్‌ను కోరారు. అలాగే పట్టణంలోని పారిశుధ్యం సక్రమంగా ఉండటం లేదని, మురికి కాలువలు శుభ్రం చేయించాలని మెజారిటీ కౌన్సిలర్ కోరారు. అనంతరం అజెండాను సభ్యులు ఆమోదం తెలియజేయడంతో సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో టిడిపి,వైకాపా కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

రబీ పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని ఎపి రైతుసంఘం మండల కమిటీ సభ్యులు రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం వల్ల సన్న, చిన్నకారు, పేద, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఉచిత పంటల బీమా పథకం అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లించిందని గుర్తు చేశారు. అదే తరహాలో ప్రస్తుత ప్రభుత్వం కూడా బీమా ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా ప్రయివేటు బీమా కంపెనీలకు పంటల బీమా పథకం అప్పగించడంతో ఆయా కంపెనీలు లాభాలు గడిస్తున్నాయిగానీ, రైతులకు మేలు చేకూరడం లేదన్నారు. కావున సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావడంతోపాటు ప్రభుత్వమే బీమా కంపెనీ నడిపి రైతులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కమిటీ సభ్యుడు జయశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యురాలు శిరీషా, సద్దలదిన్నె నారాయణ పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

రాయదుర్గంలో డిసెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి రమణయ్య పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ పురపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం ఏర్పాటైందన్నారు. యూనియన్ స్థాపించి 50ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున మహాసభలకు గుంతకల్లు ప్రాంతం నుండి ఎక్కువ మంది యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షులు మల్లికార్జున, జిల్లా కౌన్సిలర్ శంకరయ్య, సభ్యులు చిన్నరంగన్న, విశ్వేశ్వరబాబు, నిర్మల్‌కుమార్, చలపతి, రామ్మోహన్, రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

పుట్లూరు : గార్లదిన్నె మండలంలోని తలగాసుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఒక్కో కుటుంబాని రూ.25లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పెద్దిరాజు, పెద్దన్న, ఓబుళపతి, నాగేంద్ర, బలరాముడు, సురేంద్ర, రామాంజి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు ఇవ్వాలని జర్నలిస్టుల వినతి

ప్రజాశక్తి-పామిడి

జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని మండలంలోని విలేకరులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలు, ఎన్‌డిఎ ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం వర్కింగ్ జర్నలిస్టుల ఇళ్లస్థలాలకు సంబంధించి ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మల్లికార్జున, మురళి, గోపాల్, భీమాచౌదరి, శివ, రఫీ, రఘు, రమణారెడ్డి, సుబ్బు, శీనా, సూరి, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి పావని సూచించారు. సోమవారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా సిపిఎన్‌డిటి చట్టంపై వైద్యసిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన పెంచాలన్నారు. అలాగే ఎన్‌సిడి సర్వేను వేగవంతం చేయాలన్నారు. రోజూ ఐదు గృహాల సర్వే పూర్తి చేయాలన్నారు. విలేజ్ హెల్త్ న్యూట్రీషన్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఇమ్యునైజేసెషన్ (టీకాలు)పెండింగ్ క్లియర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు అవసరం

14వ బెటాలియన్ కమాండెంట్ కె.ప్రభుకుమార్



క్రీడలను ప్రారంభిస్తున్న 14వ బెటాలియన్ కమాండెంట్ కె.ప్రభుకుమార్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మానవ జీవితంలో క్రీడలు చాలా అవసరమని 14వ బెటాలియన్ కమాండెంట్ కె.ప్రభుకుమార్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న 14వ బెటాలియన్‌లో 3వ వార్షిక క్రీడా మహోత్సవం-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి క్రీడలు అవసరమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వానికి ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఐలు, ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో టెండర్ల కహానీ..!

అయిన వారి కోసం అధికారుల అడ్డదారులు..?-టెండర్ షెడ్యూల్ నిబంధనలు సైతం మార్పు -కార్పొరేషన్‌లో అధికారుల వింతపోకడ



టెండర్ల బాక్సు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెండర్ల వ్యవహారం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మొదటి టెండర్ల రద్దులో అధికారుల ఆశ్రిత పక్షపాతం, కాసుల కక్కుర్తి వ్యవహారం కార్పొరేషన్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోంది. కార్పొరేషన్‌లో పనులకు సంబంధించి సెప్టెంబర్ 9వ తేదీన థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఎంపికకు టెండర్లు నిర్వహించారు. టెండర్లు తెరిచే సమయానికి ఓ అధికారి దీనికి అడ్డుపడినట్లు సమాచారం. టెండర్లలో అనర్హత సాధించిన కంపెనీకి ఒక ముఖ్య నేతతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో వారికి మేలు చేయడమే లక్ష్యంగా సదరు అధికారి పనిచేస్తున్నట్లు చర్చ నడుస్తోంది. ఇందులో భాగంగానే ఇంజినీరింగ్ అధికారులు బాక్స్ టెండర్లను సెప్టెంబర్ నెలలో తెరవకుండా పక్కన పెట్టేశారు. మొదటిసారి పిలిచిన థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్ నిబంధన ప్రకారం కర్నూలుకు చెందిన ఇంజినీరింగ్ సంస్థ అర్హత సాధించనట్లు తెలుస్తోంది. ఇంతలో కర్నూలు నుంచి బదిలీపై వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సదరు సంస్థ ప్రతినిధి ఆత్మీయుడు కావడంతో బాక్సు టెండర్లు తెరవకుండా కొద్ది రోజులు ఆలస్యం చేశారు. ఇటీవల చావు కబురు చల్లగా చెప్పినట్లు టెండర్లను రద్దు చేసినట్లు ప్రకటించారు. టెండర్లు రద్దు నిర్ణయాన్ని లిఖితపూర్వకంగా టెండర్‌లో పాల్గొన్న కంపెనీలకు తెలియజేయాల్సి ఉంది. అలా తెలియజేస్తే ఇంజినీరింగ్ అధికారుల అడ్డగోలు చర్యలు, నిర్వాకాలు బయటపడే అవకాశం ఉంది. దీంతో అలాంటి పొరబాట్లు జరగకుండా తమ తప్పులను కప్పి పుచ్చుకునేందుకు జాగ్రత్తలు వహించారు. రెండవసారి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ పేరుతో థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్‌ను తేదీ కనపరచకుండా రాష్ట్ర స్థాయి టెండర్లు నిర్వహించారు. మొదటిసారి నిర్వహించిన టెండర్లలో సూపరింటెండెంట్ ఇంజినీర్ సూర్యనారాయణ, టెక్నికల్ ఆఫీసర్ రామ్మోహన్ పేర్లు ఫోన్ నెంబర్లతో కమిషనర్ పేరిట టెండర్ జారీ చేశారు. రెండవసారి జారీ చేసిన టెండర్‌లో అధికారుల పేర్లు లేకుండా కేవలం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ఫోన్ నెంబర్లు మాత్రమే పేర్కొన్నారు. కొందరు అధికారులు తమ తప్పులు వెలుగులోకి రాకుండా చూసేందుకు ఇలా అతి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

మొదటి టెండర్ విషయంలో చేసిన పొరపాట్లు అలా ఉంటే రెండవసారి టెండర్‌లో అయినవారి కోసం నిబంధనలను మార్పులు చేసి ఇంజినీరింగ్ అధికారులు వారి వక్రబుద్ధిని చాటుకున్నారు. మొదటి టెండర్ నిబంధనల ప్రకారం షెడ్యూల్ ఐదో కాలం కింద కన్సల్టెన్సీ కంపెనీ 10 సంవత్సరాల సివిల్ వర్క్సులో అనుభవం కలిగి ఉండాలని స్పష్టంగా పేర్కొన్నారు. రీటెండర్ షెడ్యూల్లోని నిబంధనావళి ఐదవ కాలంలో సివిల్ వర్క్సులో అనుభవం కన్సల్టెన్సీ కంపెనీకి ఐదు సంవత్సరాలకు కుదించారు. తద్వారా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు అనుకూలమైన కర్నూల్ కన్సల్టెన్సీ కంపెనీకి టెండర్లు పాల్గొనేందుకు అవసరమైన అనుభవాన్ని సవరించి మేలు చేసే ప్రయత్నం చేశారు. మొదటి టెండర్ షెడ్యూల్లోని 9వ నిబంధనావళిలో టెక్నికల్ బిడ్డుకు అర్హత పొందిన కంపెనీ 15 రోజుల కాలవ్యవధిలో అనంతపురం ఆఫీస్‌ను ఎస్టాబ్లిష్మెంట్ చేయాల్సి ఉంటుందని స్పష్టంగా పేర్కొన్నారు. రీటెండర్ షెడ్యూల్ తొమ్మిదవ నిబంధనావళిలో కాంట్రాక్టు పొందిన కంపెనీ 30 రోజుల కాల వ్యవధిలో అనంతపురంలో ఆఫీసు ఎస్టాబ్లిష్మెంట్ చేయటానికి వీలుగా కాలవ్యవధిని పొడిగించి వారి స్వామి భక్తిని చాటుకున్నారు. అభివద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పరిశీలించి నిబంధనల ప్రకారం నాణ్యత ఉన్నది.. లేనిది పరిశీలించి నివేదికను అందించటానికి థర్డ్‌పార్టీ కంపెనీ అనుభవం కలిగి ఉండాలన్న ప్రాథమిక సూత్రాన్ని సైతం తుంగలో తొక్కారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్ దక్కేలా చూడటంలో ఇంజినీరింగ్ అధికారుల ఒంటెద్దు పోకడలను ఉన్నతాధికారులు పరిశీలించి ఇలాంటి వాటిని నియంత్రించాలనే భావన కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

ఘనంగా గ్లోబల్ ఇండస్ట్రీస్ వార్షికోత్సవం



గ్లోబల్ ఇండస్ట్రీస్ దుకాణ, (ఇన్‌సెట్‌లో) నిర్వాహకులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న గ్లోబల్ ఇండస్ట్రీస్ 4వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మంజునాథ్‌రెడ్డి, రాజారెడ్డి ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు తమను ఎంతగానో ఆదరించారన్నారు. కస్టమర్ల ఆదిరాభిమానాలతో గ్లోబల్ ఇండస్ట్రీస్ అనతికాలంలోనే నమ్మకానికి మారుపేరుగా నిలిచిందన్నారు. తమ వద్ద డబ్ల్యూపివిసి విండోస్ డోర్లు, నాణ్యమైన మెటీరియల్‌తో తయారు చేసి అందిస్తున్నట్లు వివరించారు. సాధారణ ఇండివిజువల్ గృహాలు మొదలుకుని, అపార్ట్‌మెంట్లు, ఇండిజువల్ ఇళ్ల వరకూ నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అందరి సహకారంతో నాలుగో వార్షికోత్సవ వేడుకలను జరుపుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఇండస్ట్రీస్ సిబ్బంది, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో 'నారాయణ' విద్యార్థిని ప్రతిభ


నృత్యంలో ప్రతిభ కనబరిచిన నారాయణ పాఠశాల విద్యార్థినులు

అనంతపురం : కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న నారాయణ పాఠశాల విద్యార్థిని లిఖిత క్లాసికల్ డాన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి స్పార్క్ ఆఫ్ ట్రెడిషన్స్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికైనట్లు ఎజిఎం సుధాకర్‌రెడ్డి తెలిపారు. గుంతకల్లులోని శ్రీవాగ్దేవి విద్యా సంగీత కళా నృత్యం సంస్కృతి సంస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీల్లో లిఖిత విజేతగా నిలిచిందన్నారు. దీంతో స్థానిక పాఠశాలల్లో విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాధానాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం


పిఇటిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని బి.పప్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాయామ విద్య ప్రాధాన్యత, ఆవశ్యకతను పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జూటూరు షరీఫ్ వివరించారు. తర్వాత వ్యాయామ ఉపాధ్యాయుడు కె.రామన్నను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటనాయుడు, నాగరాజు, కొండారెడ్డి, రమణారెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ చిత్రలేఖనం పోటీలో 'అనంతలక్ష్మి' ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని అభినందిస్తున్న అనంతరాముడు

ప్రజాశక్తి-అనంతపురం

పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాలలో భారతీయ కళలు, వారసత్వ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీల్లో అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ఛైర్మన్ అనంత రాముడు తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎ.ప్రజ్ఞ చిత్రీకరించిన సంస్కృతి వారసత్వ చిత్రానికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి వచ్చినట్లు తెలిపారు. ఈ చిత్రంలో మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసిన విద్యార్థి ప్రజ్ఞను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఎఒ నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ల ద్వారా పోలీసు నిఘా

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం నగరంలోని ఒన్ టౌన్, ఫోర్త్ టౌన్, రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిల్లోని శివారు ప్రాంతాల్లో ఆయా పోలీసులు డ్రోన్స్ ద్వారా నిఘా పెట్టారు. ఇందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురుని అరెస్టు చేయడంతోపాటు కేసులు నమోదు చేశారు. అంతేగాకుండా జిల్లాలో నేరాలను నియంత్రించుటకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-అనంతపురం

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా ఇళ్లకు చేరాలని శ్రీచైతన్య పాఠశాల ఎజిఎం సుబ్బారెడ్డి సూచించారు. సోమవారం నగరంలని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సేఫ్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో నిత్యం ఎక్కడో ఓచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. కావున రోడ్డు నిబంధనలు పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపల్ షమీనా, అకాడమిక్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి


పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పామిడి


పంచాయతీ పరిధిలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని వామపక్ష నాయకులు అనిమిరెడ్డి, మల్లేష్ కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త బస్టాండ్ వద్ద ఉన్న పంచాయతీ స్థలం కబ్జాకు గురవుతోందన్నారు. కావున కబ్జాకు గురికాకుండా కొలతలు వేయించి హద్దులు ఏర్పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌడప్ప, ఇమాములు, నాగరాజు, బాబా ఫక్రుద్దీన్, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎంసీ సుంకన్న, కొడవండ్ల కుమార్ పాల్గొన్నారు.

కూలీలకు 'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి-యల్లనూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పనులు కల్పించాలని ఎంపిడిఒ ఎంపిడిఓ వాసుదేవరరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 100రోజులు పని దినాలను పూర్తి చేయాలన్నారు. అలాగే పనులు చేసే ప్రదేశంలో కూలీల హాజరు పట్టికను తనిఖీ చేయాలన్నారు. అలాగే కార్యాలయానికి వచ్చి అటెండెన్స్ వేసి పని ప్రదేశాలకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ షబ్బీర్, ఇసి ఓబులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ఎస్ఐ సాగర్

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో సోమవారం ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ కళాశాలలోగానీ, బయటగానీ ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే 100 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే కళాశాలకు వచ్చే సమయంలో ఎక్కడైనా రోడ్లలో ఎవరైనా ఇబ్బంది కలిగిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అంతేగాకుండా పోలీసు సిబ్బంది సాధారణ వ్యక్తుల్లా ఉంటారని, ఎక్కడైనా ఇలాంటివి జరిగినట్లయితే చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలప్ప, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలి

వాహనదారులకు పోలీసుల కౌన్సెలింగ్



బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న సిఐ కరుణాకర్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో ఆటోల ఓవర్ లోడింగ్‌పై జిల్లావ్యాప్తంగా పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆటోల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులను తరలిస్తున్న ప్రతిఆటోను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, తదితర డాక్యుమెంట్స్ తనిఖీ చేయడంతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. డబ్బు అధికంగా వస్తుందనే అత్యాశకు పోయి ఓవర్‌లోడుతో వెళ్లడం వల్ల అటు ప్రయాణీకుల ప్రాణాలు, డ్రైవర్ ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని గుర్తు చేశారు. సర్వీస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్లపైకి వెళ్లేటప్పుడు, జంక్షన్లలో వెళ్లేటప్పుడు అటూ, ఇటూ చూసి వెళ్లాలని సూచించారు. డ్రంకన్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదన్నారు. ఓవర్ లోడ్ తో వెళ్తున్న ఆటోల నుండీ ప్రయాణీకులను దింపి పంపారు. రోడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గుత్తి : ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలను పాటించాలని గుంతకల్లు డీఎస్పీ ఆముదాల శ్రీనివాసులు, సీఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.సురేష్‌బాబు సూచించారు. సోమవారం పట్టణంలోని క్రీడా మైదానంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అధికమై పలువురు మరణించారని, చాలామంది గాయపడ్డారని చెప్పారు. ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు రోడ్డు



గుత్తిలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఆముదాల శ్రీనివాసులు



శింగనమలలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ కౌలుట్లయ్య

నిబంధనలను పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను వారి వారి గమ్యాలకు క్షేమముగా డ్రైవర్లు చేర్చాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు చేపడతామని వారు హెచ్చరించారు.

శింగనమల : మండల వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సిఐ కౌలుట్లయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా చాలామంది ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో కూలీలను తరలిస్తూ ఉంటారన్నారు. అంతేగాకుండా డ్రైవర్ సీటులో నలుగురిని కూర్చోబెట్టుకుని, ఫోన్‌లో మాట్లాడుకుంటూ వెళ్తుంటారన్నారు. అలాగే ఎక్కడపడితే అక్కడ ఆటోస్టాండ్‌లు పెట్టుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు. పరిమితి మించి ఎక్కువ లోడుతో వెళ్తే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. కావున పరిమితికి లోబడే ఆటోల్లో ప్రయాణికులు, కూలీలను తరలించాలన్నారు. ఇకపోతే డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సు, యూనిఫామ్, వాహనానికి సంబంధించిన రికార్డులను దగ్గర ఉంచుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శరత్‌చంద్ర, పోలీస్‌సిబ్బంది, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని నార్పల క్రాస్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ కరుణాకర్ మాట్లాడుతూ అధికలోడు, హైస్పీడ్‌తో వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేగాకుండా ఆటో డ్రైవర్లు తమ లైసెన్స్‌తో పాటు, వాహన ధృవపత్రాలు తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఆదినారాయణ, జమేందార్ శివానంద, కానిస్టేబుల్ శ్రీనివాసులు, రవి, వీరనారప్ప, ఆటో యూనియన్ సభ్యులు మారుతీప్రసాద్, నాగేంద్ర, రాఘవరెడ్డి, చల్లా కొండ, చెరుకూరి బ్రహ్మ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : రోడ్డు నిబంధనలపై ఆటో డ్రైవర్లకు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్యాసింజర్ల ఎక్కించుకున్నా, ఓవర్ లోడుతో వెళ్లినా, లైసెన్సు లేకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండల పరిధిలోని వేపులుపర్తి క్రాస్ వద్ద పోలీసులు వాహనదారులకు సోమవారం రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా అధిక లోడుతో వచ్చిన వాహనాలు, పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలకు అపరాద రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పుట్లూరు : మండలంలోని ఆటోల్లో అధిక లోడుతో ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని సిఐ సత్తిబాబు హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని ఎ.కొండాపురం వద్ద ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగగా అధిక లోడుతో వెళ్తున్న ఐదు ఆటోలకు అపరాధ రుసు విధించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయించాలి

ప్రజాశక్తి-అనంతపురం

ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని హనిమిరెడ్డిపల్లి, గంగవరం, వెంకటాద్రిపల్లి, నరసాపురం, గుండ్లపల్లి, విరపాపల్లి, యర్రగుడి, అవులన్న, బెలుగుప్ప ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌టియు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం బోధనకు సంబంధం లేని అపార్, తదితర యాప్‌ల వల్ల ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం కలుగుతోందన్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయటానికి చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. కావున బోధనేతర పనులకు ఉపాధ్యాయులను వినియోగించకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ వాణి కో కన్వీనర్ జి.కిషోర్, మండల సీనియర్ నాయకులు ఇమామ్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును చేయిస్తున్న ఎస్‌టియు నాయకులు

అహడా ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న జనసేన నేతలు

పామిడి : అనంతపురంలోని హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో అహుడా ఛైర్మన్‌గా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల జనసేన నాయకులు టిసి.వరుణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వాసగిరి మణికంఠ, ధనుంజయ, కొట్టాల సూర్యనారాయణ, జగదీష్, పెన్నోబులేసు, శ్రీనివాసులు, అఫ్జల్, లాలూస్వామి, అర్జున్, మురళి, వడ్డే రాము, నక్కల రామాంజనేయులు, వీరప్రతాప్, రాజు, నాగేంద్ర, నాగరాజు, నవీన్, రవితేజ, సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

రాయదుర్గం : చలికాలంలో వచ్చే టిబి, నిమోనియా, అస్మా, తదితర సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వాటి నుంచి రక్షణ పొందవచ్చునని ఆరోగ్య విద్యా బోధకులు లక్ష్మీనారాయణ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్ తెలి పారు. 'స్వచ్ఛ రాయదుర్గం-స్వస్థ్య రాయదుర్గం'లో భాగంగా సోమవారం పట్టణంలోని మేదరవీధిలో ప్రజలకు సీజనల్ వ్యాధులు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరి సెక్రటరీ రాముడు, హెల్త్ సెక్రటరీలు సుజాత, అరుణ, లలిత, సునీత, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను తప్పనిసరిగా వాడాలి

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మరుగుదొడ్లను వాడాలని వజ్రకరూరు సర్పంచి మోనాలిసా, ఇఒఆర్‌డి దామోదర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వజ్రకరూరు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన సామాజిక దురాచారమని, సమాజం మంచి పర్యావరణం, ఆరోగ్యాన్ని కాపాడేందుకు వాటిని నివారించాలన్నారు. అలాగే పర్యావరణం కోల్పోవడంతో పాటు నీటి వనరులు కలుషితమై వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎర్రిస్వామి, ఆరోగ్య విస్తీర్ణ అధికారి గురు ప్రసాద్ తో పాటు మండల స్థాయి అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు : ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను తప్పనిసరిగా వాడటంతోపాటు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ అలివేలమ్మ సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని సచివాలయం వద్ద ఉన్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బహిర్భూమికి ఆరుబయలు ప్రదేశానికి వెళ్లకుండా తప్పనిసరిగా మరుగుదొడ్లను వాడాలన్నారు. అంతేగాకుండా మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపిడిపి వాసుదేవరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా మరుగుదొడ్ల శుభ్రత, వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యులు లోకేష్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ సుప్రజారెడ్డి ఉపాధ్యాయ బృందం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్‌లో సోమవారం టిడిపి కార్యకర్త కొత్తపల్లి గిరిబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వారింటికి వచ్చి గిరిబాబు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాలవ మాట్లాడుతూ గిరిబాబు పార్టీ కోసం బాగా పని చేశారని వారి కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాలవ వెంట మండల కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు మల్లికార్జున, స్టోర్ డీలర్లు, తదితరులు ఉన్నారు.

పేకాటజూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండలంలోని మలపనగుడి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి 9 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసి 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 12,900 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూ వివాదంలో అన్నదమ్ముల ఘర్షణ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని పాలవెంకటాపురం గొల్లలదొడ్డి గ్రామంలో సోమవారం భూ వివాదంపై అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు.. గొల్ల చిత్తప్ప నెల రోజులు క్రితం ఎరడికెర గ్రామానికి చెందిన బోయ తలారి తిప్పేస్వామి భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిలో వారం క్రితం బోరు వేయగా నీరు సమృద్ధిగా పడ్డాయి. దీంతో సోమవారం బోరుబావిలోకి మోటారు దించేందుకు చిత్తప్ప, ఆయన కుమారుడు లింగారెడ్డి వెళ్లగా అదే గ్రామానికి చెందిన చిత్తప్ప అన్న గొల్ల నాగప్ప, మల్లయ్య, చిత్రలింగ, అనిత, నాగమణి కలిసి వారిపై మాకుమ్మడిగా దాడి చేశారు. ఎట్టి పరిస్థితుల్లో మోటారు దింపేందుకు వీలులేదని షరతు పెట్టారు. ఘర్షణలో చిత్తప్ప, లింగారెడ్డి తీవ్రంగా గాయపడగా వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు చిత్తప్ప, లింగారెడ్డి కోరుతున్నారు.